అరుదైన శస్త్ర చికిత్స

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ హాస్పిటల్ (ఏఓఐ)లో పెద్దపేగు క్యాన్సర్‌తో బాధపడుతున్న 93 ఏళ్ల వృద్ధునికి అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఎసెండింగ్ కోలన్ (పెద్ద పేగులో ఓ భాగం)కు ఏఓఐ బృందం లాపరోస్కోపిక్ అసిస్టెడ్ రాడికల్ రైట్ హెమీ కొలెక్టమీ చేశారు. సీటీఎస్ఐ, దక్షిణాసియా సీఈఓ హరీష్ త్రివేది శనివారం మాట్లాడుతూ ఏఓఐలో క్యాన్సర్ చికిత్సలో అధునాతన విధానాలను కొనసాగించడమే తమ లక్ష్యమని తెలిపారు.

లక్నోకు కార్పొరేటర్ల బృందం



గచ్చిబౌలి: జీహెచ్ఎంసీ కార్పొరేటర్ల బృందం లక్నోకు చేరుకుంది. లక్నో మున్సిపల్ కార్పొరేషన్ వినూత్న రీతిలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వెళ్లారు. శేరిలింగంపల్లి సర్కిల్ నుంచి గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌లు లక్నో వెళ్లిన వారిలో ఉన్నారు.

వచ్చే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే విజయం



టి.మహిపాల్‌రెడ్డి

శేరిలింగంపల్లి: వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని పది డివిజన్లలో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ శేరిలింగంపల్లి సభ్యత్వ ప్రముఖ్ తోపుగొండ మహిపాల్‌రెడ్డి తెలిపారు. బీజేపీ సభ్యత్వ నమోదు ప్రముఖ్‌గా నియమితులైన సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో రెండు లక్షల సభ్యత్వ నమోదే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డివిజన్ల వారీగా సభ్యత్వ నమోదుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని, అత్యధికంగా సభ్యత్వాలు చేసే దిశగా పనిచేస్తున్నట్టు వివరించారు. బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



చిన్నారులకు అన్నప్రాసన

శేరిలింగంపల్లి: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం తీసుకోవాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతీ బాయి తెలిపారు. శనివారం శేరిలింగంపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మోతీబాయి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనత రాదన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి విజయపూర్ణిమ, సీడీపీఓ కవిత, మెడికల్ ఆఫీసర్ అన్నపూర్ణ, పీహెచ్ఎన్ శ్యామల, చైల్డ్ ఫండ్ కోర్డినేటర్స్ శ్రీశైలం, దివ్య, అంగన్‌వాడీ టీచర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. జలమయం



గచ్చిబౌలి: వర్షానికి శేరిలింగంపల్లిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం వర్షం కురిసింది. రెండురోజుల పాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వర్షం ఉపశమనం కలిగించింది.గచ్చిబౌలి, కొండాపూర్, లింగంపల్లి, మియాపూర్, చందానగర్, మాదాపూర్, గోపన్‌పల్లి తదితర ప్రాంతాలలో వర్షం పడింది.

ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ ప్రారంభం



మాదాపూర్: శిల్పారామంలో శనివారం రసోల్లాస్ నేషనల్ ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ ప్రారంభమైంది. కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా అర్ధనారీశ్వరం, ఆదిత్య హృదయం తదితర అంశాలను సురేంద్రనాథ్, బిజినాలు ప్రదర్శించి అలరించారు. అనిత ముక్త శౌర్య మోహినీయట్టం ప్రదర్శించారు. ముంబైకి చెందిన కాశ్మీరత్రివేది శిష్యబృందం భరత నాట్యాంశాలు అలరిపు, శివ పంచాక్షరీ స్తోత్రం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. పేరిణి నాట్య గురువు డాక్టర్ కళాకృష్ణకి నాట్యకళా కుసలా సాగర పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల, పూర్వ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం శారదా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు జయశ్రీ శిష్యబృందం పలు అంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. వినాయకవందనం, అన్నమయ్య సంకీర్తనలకు నృత్యాభినయం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాకారులు శాన్వి, సౌమ్య, ఆరాధ్య, శాంభవి, శ్రీవిద్య, చిద్విలాసిని తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన

శంషాబాద్: పట్టణంలోని 19వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం కౌన్సిలర్ సంజయ్‌కుమార్ యాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. బూరుగుకుంట వెపు ఉన్న శ్మశానవాటిక వరకు వేస్తున్న సీసీ రోడ్డు పనులను డీఈ సాజిద్, ఏఈ నరేష్‌లు పరిశీలించారు.





చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ బస్తీలో ఒకే భవనంలో ఉన్న అంగన్‌వాడీ, బస్తీ దవఖాన

ఒకే భవనంలో అంగన్‌వాడీ, బస్తీ దవాఖాన

వసతులు కరువు ● ఇందిరానగర్ బస్తీవాసులకు తప్పని ఇబ్బందులు

చందానగర్: బస్తీలలో మెరుగైన వైద్యం అందించాలని గత ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది. ఐతే వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో ఉన్న బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం రెండూ ఒకే భవనంలో ఉన్నాయి. దీంతో భవనం ఇరుకుగా మారింది. భవనం చుట్టుపక్కల చెత్త చెదారం, మట్టికుప్పలు వేస్తున్నారు. మరుగుదొడ్ల దుర్గంధం వెదజల్లుతున్నాయి. అంగన్‌వాడీ, బస్తీ దవాఖానకు వచ్చే వారు ఇబ్బందులపాలవుతున్నారు. దవాఖానలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్యులు, రోగులకు కావాల్సిన కనీస వసతులు కల్పించలేదు. మంచినీరు, పారిశుధ్యం గురించి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



బస్తీ దవాఖానా ఆవరణలో చెత్త చెదారం, మట్టి కుప్పలు, పిచ్చిమొక్కలు



బస్తీ దవాఖానా పక్కన ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సమస్యలు ఇవే..

- బస్తీ దవాఖాన భవనంలో ఇష్టానుసారంగా చెత్త చెదారం వేస్తున్నారు.
- భవనం పరిసరాలు మట్టి కుప్పలతో అపరిశుభ్రంగా మారాయి.
- మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.
- దవాఖాన వద్ద ఆకతాయిలు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు.
- ప్రధాన గేటు వద్ద ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది.
- వర్షాకాలం వరదనీరు మొత్తం భవన ఆవరణలోకి వచ్చి చేరుతున్నాయి.
- కమ్యూనిటీ హాల్ కోసం గత సంవత్సరం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదు.

పరిష్కరించాల్సినవి..

- పారిశుధ్య కార్మికులు ప్రతి రోజు బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుభ్రం చేయాలి
- మంచినీటి బోరుతో పాటు మంజీరా నీటి కనెక్షన్ ఇవ్వాలి
- రాత్రి సమయాల్లో పోలీసులు ఈ ప్రాంతంలో పెట్రోలింగ్ చేయాలి
- దవాఖాన చుట్టూ పిచ్చిమొక్కలు తొలగించి, చెత్త, చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలి
- మురుగుదొడ్లు ప్రతి రోజు శుభ్రం చేసే విధంగా సిబ్బందిని నియమించాలి.

చెత్త వేయకుండా చూడాలి



బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో చెత్త,చెదారంతో పాటు మట్టి పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. దవాఖాన చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి.
– రాజేశ్వరచారి, ఇందిరానగర్ బస్తీ

కమ్యూనిటీహాల్ పనులు ప్రారంభించాలి



ఇందిరానగర్‌లో సుమారు రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ కొరకు గత అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. –రవి, ఇందిరానగర్ బస్తీ

గణేష్ గడ్డ కిటకిట



పటాన్‌చెరు టౌన్: సంకటహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్‌లు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ శశిధర్, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ తెలిపారు. ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

మూసాపేట: ఫతేనగర్‌లోని శ్రీ శిశుమందిర్ పాఠశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌టీటీ సహకారంతో ఎంఎస్ ఆఫీస్, టాలీ, హెచ్‌టీఎంఎల్ వంటి వాటిలో శిక్షణ ఉంటుందని, నిరుద్యోగులు, ఇంటర్, డిగ్రీ చదువుతున్న వారు అర్హులు అని తెలిపారు. మరిన్ని వివరాలకు 8792492849లో సంప్రదించాలన్నారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

పటాన్‌చెరు: తెలంగాణ ఉద్యమంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీది కీలక పాత్ర అని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బస్టాండ్ ప్రాంగణంలో గల బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు.

ప్రత్యేక పూజలు.. నిమజ్జనాలు



మాధవరం కాలనీలో గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్యే గాంధీ తదితరులు



పాపిరెడ్డి కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీలో శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుని శోభాయాత్ర, ఎల్లమ్మబండలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం కార్యక్రమాలకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జన యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో లద్దె నాగరాజు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ , జిల్లా గణేష్, అనిల్ రెడ్డి, కాశీనాద్ యాదవ్, ఎండి ఇబ్రహీం, చిన్నోళ్ల శ్రీనివాస్, రమేష్, మహేష్‌గౌడ్, రాకేష్, యాదగిరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డి కాలనీలో..

శేరిలింగంపల్లి: పాపిరెడ్డి కాలనీ ఆరంభ్ టౌన్ షిప్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మోహన్‌రావు, రవీందర్‌రావు, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, నరేందర్ బల్లా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్డును అభివృద్ధి చేయండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 152 లింక్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్గారి రమణ మాట్లాడుతూ ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ మార్గంలో నిత్యం వేలాది టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. రోడ్డు బాగా లేకపోవడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. సుమారు ఐదువేల మంది ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని బీఆర్ఎస్ పార్టీ సీనియర్‌నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన బీఆర్ఎస్‌భవన్‌లో మాజీ మంత్రి తారకరామారావు సమక్షంలో శేరిలింగంపల్లి ముఖ్య నాయకుల సమావేశం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు,సీనియర్ నాయకులు రవియాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రామకృష్ణగౌడ్, చెన్నంరాజు, బాబుమియా, విజయలక్ష్మీ, జమీర్, రాగం జంగయ్యయాదవ్, అంజమ్మసతీష్, రాజు, తిరుమలేష్, అనిల్‌సింగ్ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు సమగ్ర సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య, డీసీ ముకుంద్‌రెడ్డి

శేరిలింగంపల్లి: బీఎల్‌ఓలు సర్వే సమగ్రంగా నిర్వహించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ,టీమ్ డిప్యూటీ కలెక్టర్ బి.చెన్నయ్య సూచించారు.శనివారం శేరిలింగంపల్లి సర్కిల్ నియోజకవర్గ ఈఆర్‌ఓ కార్యాలయాన్ని ఎలక్షన్ ఆఫీసర్ బి.చెన్నయ్య, డిప్యూటీ తహశీల్దార్ షహరాజ్‌లు సందర్శించారు. శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ పి.ముకుంద్‌రెడ్డి, మండల తహశీల్దార్ వెంకారెడ్డి, ఏఈఆర్‌ఓ మోహన్‌రెడ్డిలతో కలిసి ఓటరు జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) 2025 సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ ఈసీఐ నిబంధనల ప్రకారం గడువులోపు సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల వివరాలలో తప్పులు ఉన్నా, కొత్తగా ఓటరు నమోదుపై బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలన్నారు. కుటుంబంలో ఎవరైన మృతి చెందితే వారి వద్ద నుంచి సంబంధిత సర్టిఫికెట్ తీసుకోవడంతో పాటు ఫారం 7ను తీసుకోవాలన్నారు. 1500 ఓటర్లకు పై బడిన పోలింగ్‌స్టేషన్‌ల పరిధిలో అదనంగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని లక్ష్మీవిహార్ ఫేజ్–2 కాలనీ, తారానగర్, ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లో ఇళ్లకు వెళ్ళి వారి నుంచి వివరాలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో టీమ్‌లు పర్యటించాయి. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు ప్రేమ్‌కుమార్, వాహీద్ అలీ, డిప్యూటీ తహశీల్దార్ అవినాష్, ఏఎంసీలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి



నిజాంపేట్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సౌజన్య అన్నారు. శనివారం ప్రగతి నగర్ ఎన్టీఆర్ పార్కులో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ –2024 కార్యక్రమానికి హాజరైన కమిషనర్ స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకుమారితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మొక్కలు పెంచాలని సూచించారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వినతి..

నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని సర్వే నంబరు 334లోని ఖాళీ స్థలంలో ప్రజల ఉపయోగార్థం కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ శనివారం జర్నలిస్ట్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ సౌజన్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మారుతిసాగర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, మున్సిపల్ నిధులను కేటాయించి భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు.




గుడిసెలు కూల్చివేత.. వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మియాపూర్: హెచ్ఎండీఏ అధికారులు గుడిసెలు కూల్చివేస్తుండడంతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ఎంఏనగర్ కాలనీలో రోడ్డు నంబర్–10లో దుర్గయ్య కూలి పనులు చేసుకుంటూ గత 20 సంవత్సరాలుగా ఎంఏనగర్‌లోనే నివాసముంటున్నాడు. గత రెండు నెలల నుండి హెచ్ఎండీఏ అధికారులు 100, 101 సర్వేనంబర్‌లలో భూమి చుట్టూ కంచె వేస్తున్నారు. ఎంఏనగర్ కాలనీ పక్క నుండి 100 సర్వేనంబర్ గల భూమి ప్రాంతంలో రోడ్డు నంబర్–10లో చివరగా దుర్గయ్య గుడిసెతో పాటు మరో రెండు గుడిసెలున్నాయి. శనివారం హెచ్ఎండీఏ అధికారులు దుర్గయ్య గుడిసెను తొలగించేందుకు ప్రయత్నించగా అతను చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు దుర్గయ్యను దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం దుర్గయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ప్రభుత్వ భూములను బడాబాబులు ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డీన్ ప్రొ.జైప్రకాశ్ గౌతమ్



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ జైప్రకాశ్ గౌతమ్ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీలో క్లీనప్ డ్రైవ్ పేరిట స్వచ్ఛత కార్యక్రమం, స్వచ్ఛతా క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పనిచేసే కార్యాలయం, చదివే విద్యాసంస్థల్లో, పరిసరాల్లో శుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌ను క్లీన్ అండ్ గ్రీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ విభాగం పనిచేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్ పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అజయ్‌ప్రకాశ్, రాహుల్ క్విజ్ పోటీలు నిర్వహించారు.



నిమజ్జనం.. వ్యర్థాల తొలగింపు

ఐడీఎల్ చెరువుకు బారులు తీరిన గణనాథులు





మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. మరో పక్క వ్యర్థాలను తొలగిస్తున్నారు. శనివారం సుమారు 350 వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఐడీఎల్ చెరువు వద్ద 2 క్రేన్లు అందుబాటులో ఉన్నాయి. వినాయక విగ్రహాల నిమజ్జనానికి బారులు తీరడంతో ఉదయం 11.30 గంటల వరకు నిమజ్జనం కొనసాగింది. ఇప్పటికే చెరువులోని పీఓపీ, స్టీల్‌ను పూర్తిగా తొలగించారు.